**1983 ఉగాది కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ!**

పెళ్ళయినప్పట్నించీ పార్వతమ్మ భర్తను ఎన్నో కోరికలు కోరుతూనే వుంది. తన కోర్కెల నతడు పట్టించుకుంటున్నాడా అన్నదాంతో ఆమెకు నిమిత్తం లేదు. రాబర్ట్ బ్రూసులా అలా ప్రయత్నిస్తూనే వుంది.

పెళ్ళి కాగానే భర్తతో కలిసి సరదాగా రెండు నెలలు కాశ్మీర్లో గడపాలని ఆమె అనుకుంది. భర్త ఆమెకు తన బాధ్యతలూ, ఆర్థిక పరిస్థితీ వివరించి చెప్పి ఆమె సహకారాన్ని కోరాడు. ఆమె అర్థం చేసుకుంది.

భర్త ఉద్యోగం వున్నఊళ్ళోనే కావడం వల్ల పార్వతమ్మ అత్తగారితో కలిసుండ వలసివచ్చింది. అత్తగారికీ ఆమెకూ పడ లేదు. ఆమె వేరు కాపురం గురించి భర్తను కోరసాగింది.

# బ్రహ్మాస్త్రం

వసుంధర



పార్వతమ్మ భర్త వెంకటేశ్వర్లు ఓ రాత్రంతా ఆమెను అనునయించి - ఇప్పుడు వేరుపడడంవల్లతనకూ భార్యకూ ఎలాంటి చెడ్డపేరు వస్తుందో విపరించి చెప్పాడు.

"నాకు చెడ్డపేరు వచ్చినా ఫరవాలేదు. భరిస్తాను. మీకిష్టంలేకపోతే సూటిగా ఆ విషయం చెప్పండి" అంది పార్వతమ్మ.


"మనిద్దరం వేరే విడిగా ఉండడం నా కిష్టమే. కానీ అప్పుడంతా నన్ను పెళ్ళాం రా గా నే మారిపోయాడనీ. కృతఘ్నుడనీ అంటారు. చుట్టూ ఉన్నవారిచేత అలాగని పించుకుంటే నేను తలెత్తుకు తిరగలేను-" అన్నాడు వెంకటేశ్వర్లు. అతడి దీనత్వానికి కరగిపోయి అత్తగారితో రాజీ పడింది పార్వతమ్మ.


అత్తగారికీ తనకూ ఎలాంటి గొడవలు వచ్చినప్పటికీ. భర్త అత్తగారినే సమర్థిం చడం పార్వతమ్మకు నచ్చేది కాదు. తనకు పార్వతమ్మ అంటేనే ఎక్కువప్రేమ అని కానీ లోకంకోసం అలా నటిస్తున్నాననీ వెంకటేశ్వర్లు ఆమెను సమాధానపరిచేవాడు.

పార్వతమ్మ తొలిసారి కడుపుతో ఉండగా వెంకటేశ్వర్లు జాతకం తిరిగింది. హైద్రా దాదులో ఓ ప్రైవేటు కంపెనీలో ఎక్కువ జీతంమీద ఉద్యోగం వచ్చింది. అంతా పార్వతమ్మ అదృష్టాన్ని, పుట్టబోయే బిడ్డ అదృష్టాన్నీ మెచ్చుకున్నారు.

పార్వతమ్మకు మగబిడ్డ కలిగాడు. ఆమె హైదరాబాదు కాపురానికి వెళ్ళింది. కూడా అత్తగారు వచ్చి కొన్నాళ్ళుంది. కొన్నాళ్ళు మాత్రమే ఉంది. పార్వతమ్మ కోరుకున్న జీవితం ప్రారంభమైంది. అయితే ఆమె కోరికలు తీరడం లేదన్న సమస్య అలాగే ఉంది.

వెంకటేశ్వర్లు జీతం. హోదా పెరగగానే అతడి తండ్రి అవసరాలుకూడా పెరిగాయి. ఆయన తరచుగా డబ్బుకోసం కొడుక్కి ఉత్తరాలు రాస్తుండేవాడు.





"ఇన్నాళ్ళు లేనిది ఇన్ని అవసరాలెలా వచ్చాయి? మీ ఉద్యోగం పూర్వపుదే అయితే ఏం చేసేవారు? ఇక్కడ మనమేం సుఖపడిపోతున్నామోనని కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు.అంతా పెద్ద నాటకం.." అని పార్వతమ్మ చాలాసార్లు అంది.

"వాళ్ళడిగినంత మనమెలాగూ పంపడం లేదు.అడిగినప్పుడల్లా ఎంతోకొంత పంపడం కొడుగ్గా నాధర్మం"అనేవాడువెంకటేశ్వర్లు.

"అయినా వాళ్ళకు డబ్బు పంపడం వల్ల మనమేమీ ఇబ్బంది పడడం లేదు కదా-" అని కూడా అంటూండేవాడతను!

"అయితే ఈ పండక్కి నాకు అయిదు వందలు పెట్టి పట్టుచీర కొనండి. చాలా కాలంగా దాటవేస్తున్నారు-" అంది పార్వతమ్మ.

"అయిదు వందలు పెట్టి పట్టుచీర కొనేది- అప్పుడప్పుడు పేరంటాలకు కట్టు కోవడానికీ- మిగతా సమయాల్లో పెట్టెలో పెట్టి పూజచేయడానికీ మాత్రమే కదా- అదే టెర్లిన్ చీరలయితే మూడో నాలుగో వస్తాయి." అన్నాడు వెంకటేశ్వర్లు.

"పోనీ అవే నాలుగు కొనండి-" అని పార్వతమ్మ అంటే మళ్ళీ ఏదో చెప్పేవాడు. మొత్తం మీద వెంకటేశ్వర్లు తను అను కున్నదే చేసేవాడు.

ఓసారి తమ్ముడి దానేషన్‌కని వెంక టేశ్వర్లు ఇంటికి ఒక్కసారి రెండు వేల రూపాయలు పంపాడు. దానిమీద పార్వ తమ్మ ఏమాత్రమూ రభస చేయకపోవడం వెంకటేశ్వర్లుకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే మరు సంవత్సరం తన తమ్ముడి దానేషన్‌కి పదిహేను వందలు పంపమని పార్వతమ్మ అడిగితే అతడు నానా రభసా చేశాడు—డబ్బు పంపలేదు.

పార్వతమ్మ ఇంట్లో చాదస్తపు ఆచారాలు చాలా ఉండేవి. ఆ కారణంగా నెలకు మూడు రోజులు ఆమె బయటకూర్చుంటూ ఉండేది. ఆమె నరనరాలా జీర్ణించుకుపోయిన ఈఆచా రాన్ని భర్త మూడురోజుల ఉపన్యాసంతో మార్పించగలిగాడు.

వెంకటేశ్వర్లు తాగుబోతు కాదు కానీ- పార్టీలకు వెళ్ళినప్పుడు తాగి వస్తుండేవాడు. దీనికి పార్వతమ్మ తన ఆక్షేపణ తెలియ జేసింది.

తాగడం తప్పు కాదనీ-విదేశాల్లో దొరలు ప్రతిరోజూ తాగుతారనీ-కంపెనీల్లో జరిగే పార్టీల్లో నలుగురితోపాటు తనూ తాగకపోతే వెలితిగా ఉంటుందనీ వెంకటేశ్వర్లు భార్యకు నచ్చజెప్పాడు. తనకు తెలిసిన స్నేహితలందరీని ఉదాహరణగా ఇచ్చాడు.

ఇష్టమైనా కాకున్నా పార్వతమ్మ దీనికి సరిపెట్టుకోక తప్పలేదు.

ఇలా జీవితమంతా ఆమె వెలిబుచ్చే ప్రతి కోరికకూ ఏదోవిధంగా ఆమెను సమాధాన పరుస్తూనేవచ్చాడు భర్త. అందుకు కేవలం మంచిగా చెప్పే పద్ధతి ఒక్కటి మాత్రమే అతడవలంబించలేదు.

వివాహమైన మూడు నాలుగు సంవత్సరాల వరకూ అతడికి భార్య అంటే చాలా ఆకర్షణ వుండేది. అప్పట్లో సామ దానాలకు మించి మరే ఉపాయమూ అతడు ప్రదర్శించలేదు. ఆపైన భేద దండోపాయాలు కూడా ఉపయోగించేవాడు.

"స్త్రీలది ఎదిగీ ఎదగని మనసు. అందుకు కారణం మనదేశంలోని వాతావరణం. ఈ పరిసరాల్లో అందరాడవాళ్ళూ పార్వతమ్మకు లాగే తయారౌతారు. అవసరాన్నిబట్టి సామ దాన భేద దండోపాయా లుపయోగించి వాళ్ళను మన దారికి తెచ్చుకుని - వారిలోని స్వార్ధ బుద్ధిని ఖండిస్తూండాలి" - అని వెంకటేశ్వర్లు తరచుగా తన తలిదండ్రుల వద్దనూ స్నేహితుల వద్దనూ కూడా అంటూండేవాడు.

భార్యను అదుపులో ఉంచడంలో ఎవరైనా అతని తర్వాతేనని వెంకటేశ్వర్లు తలిదండ్రులు ఇంట్లో చెప్పుకునేవారు.

పార్వతమ్మకు నలుగురు పిల్లలు. మొదటి ముగ్గురూ మగవారు— చివరిది ఆడపిల్ల. అందరికీ బాగా చదువులు వచ్చాయి. ఇటీవలే పెద్దవాడికి ఉద్యోగం కూడా వచ్చింది — నేషనలైజ్డ్ బ్యాంకులో ఆఫీసరుగా.

పిల్లల చదువుల విషయంలోనూ. పెంపకం విషయంలోనూ కూడా పార్వతమ్మ చెప్పింది ఒక్కటీ జరుగలేదు. మొదట్లో భర్తా. ఆ తర్వాత పిల్లలూ అన్ని విషయాల్లోనూ ఆమెను ఖండించేవారు.

అయితే పార్వతమ్మకు జీవితంలో అసంతృప్తి లేదు. భర్త తన మాటల నమలు చేయడం లేదన్న విషయం ఏరోజుకారోజే ఆమె మర్చిపోయేది. అందువల్లే భర్తను మళ్ళీమళ్ళీ కోరికలుకోరేది. చూసేవాళ్ళంతా ఆమె అదృష్టాన్ని అభినందిచేవారు. భర్త మంచి హోదాలో ఉన్నాడు. పిల్లలు బుద్ధిమంతులు, తెలివైనవారు. వడ్డించిన విస్తరి ఆమె జీవితం. ఏ ఆడదైనా యింతకుమించి




కోరుకునేదేముంటుంది ?

పార్వతమ్మ పెద్ద కొడుకు గిరికి చాలా పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. వాటిలో రమాకాంతం సంబంధం బాగుందనిపించింది.

రమాకాంతం కూతురు ఉమ — గిరికి అన్ని విధాలా ఈడూ జోడూగా ఉంటుంది. గిరికి ఉమ నచ్చింది. జాతకాలు కూడా సప్పాయి.

రమాకాంతం పదివేలు కట్నమిస్తానన్నాడు. కనీసం పదిహేనువేలైనా కట్నమివ్వాలని పార్వతమ్మ అంది. అంతే కాకుండా అప్పగింతల బట్టలు, వియ్యపురాలు, ఆడపడుచుల లాంఛనాల విషయంలో కూడా ఆమె పెద్దకోరికలే కోరింది. కట్నం, లాంఛనాలు వగైరా కలిపి ఆడపెళ్ళివారికి కనీసం పాతికవేలవుతుంది.

రమాకాంతం మరీ అంత స్తోమతు లేనివాడు కాదు. కానీ ఆయనకిద్దరాడపిల్లలు. ఓ పిల్లకిలా జరిపిస్తే రెండో పిల్లకూ ఇలాగే జరిపించాల్సి ఉంటుంది. రెండు పెళ్ళిళ్ళు ఈ విధంగా తను చేయలేనని ఆయనభయం. అదీకాక వెంకటేశ్వర్లు ఆధునిక భావాలు కలవాడనీ ఆయనకు డబ్బాశ తక్కువనీ చెప్పుకుంటారు.

రమాకాంతం వెంకటేశ్వర్లునికలుసుకుని ఇబ్బంది వివరించుకున్నాడు. వెంకటేశ్వర్లు అంతా విని"ఇందులో నాదేంలేదండీ-అంతా మా ఆవిడ ఇష్టం. నా కొడుకు పెళ్ళిలో నా మాట నెగ్గి తీరవలసిందేనని ఆవిడ పట్టుబట్టింది. ఎన్నో విషయాల్లో ఆవిడ మాట కాదన్నాను. ఈ విషయంలో ఆవిడమాట కాదనడం నాకిష్టం లేదు" అనేశాడు. తూగలేమనుకునే పక్షంలో మరో సంబంధం చూసుకోమని కూడా వెంకటేశ్వర్లు రమాకాంతానికి సూచించాడు.

ఫలితంగా రమాకాంతం దూరపుబంధువు ఒకామె పార్వతమ్మను కలుసుకుంది— "మీ ఆయన నువ్వు గీచినగీటు దాటడు కదా— మధ్యతరగతి ఇళ్ళలో ఇంతలేసి డబ్బు పెళ్ళిళ్ళకు ఎవరివ్వగలరమ్మా-నువ్వు చెబితే మీ ఆయన ఒప్పుకుంటాడు. అబ్బాయీ, అమ్మాయీ ఈడూ జోడూగా వున్నారు. జాతకాలు కలిశాయి. ఈ సంబంధం వదులుకోరాదని మా తాపత్రయం...."అందావిడ.

ఈ విషయంలో భర్త తనను సమర్థిస్తున్నాడని తెలియగానే పార్వతమ్మకు కలిగిన ఆనంద మింతా అంతా కాదు. అసలావిడ తన మాట ఎలాగూ చెల్లదన్న ధీమాతో నోటికి వచ్చిన అంకెలు చెప్పింది. తన మాటకు విలువవున్నదని తెలియగానే జీవితంలో వచ్చిన ఈ అపూర్వావకాశాన్ని ఆవిడ వదులుకోదల్చుకోలేదు. తను మాటంటే మాటేననీ - ఇందులో బేరసారాలు కుదరవనీ పార్వతమ్మ రమాకాంతం చుట్టానికి ఖచ్చితంగా చెప్పేసింది.

ఈ విషయమై గిరి కూడా తల్లినేమీ అనలేదు-"నే చేసుకునే పెళ్ళి మా అమ్మకు తృప్తి కలిగించాలి—" అన్నాడతడు.

హఠాత్తుగా తన స్థానం ఇంట్లో పెరిగిపోయినట్లు గుర్తించింది పార్వతమ్మ. ఆమెకు చాలా ఉత్సాహం వచ్చింది. ఈ సంబంధం చెడిపోయి - మరో సంబంధం చూసుకోవాల్సి వచ్చిన పక్షంలో ఈసారి కట్నమే పాతిక వేలు అడుగుతానని అన్నదామె.

అయితే ఆ సంబంధం చెడిపోలేదు. ఎటొచ్చీ ఆడపెళ్ళివారు తమలోతాము వియ్యపురాలు గడుగ్గాయి అని చెప్పుకున్నారు.

ఆపైన రచయితలు, రచయిత్రులు — పార్వతమ్మ లాంటి ఆడవాళ్ళే ఆడవాళ్ళకు శత్రువులుగా ఉంటున్నారని కథలు, నవలలు, వ్యాసాలు రాస్తున్నారు. మగాళ్ళని వదిలి అవునంటున్నారు.

అయితే నిజమేమిటంటే— ఇది పురుష ప్రపంచం. రామాయణంలో ఆంజనేయుడిలా ఈ ప్రపంచంలో పురుషుడు సర్వశక్తిసంపన్నుడు. అతనెప్పుడైనా ఆడదాని మాటకు కట్టుబడ్డాడంటే — దాన్ని అతని అసహాయతగా భావించరాదు.

ఆంజనేయుడు ఇంద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రానికి ఎందుకు కట్టుబడ్డాడు? బ్రహ్మాస్త్రం మీది గౌరవంతో.

విజయం ఇంద్రజిత్తుది కాదన్న విషయం పార్వతమ్మ వంటి ఆడవాళ్ళు ఎప్పటికి గుర్తిస్తారో తెలియదు. ●